క్లుప్తంగా

నేడు హనుమాన్ చాలీసా పారాయణం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని శారదా కుటీర్‌లో గురువారం శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రం, 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం జరగనుందని కుటీర్ నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5.30 గంటల నుంచి 11.30 వరకు జరుగుతుందని, అనంతరం హారతి, తీర్థప్రసాదల పంపిణీ ఉంటుందని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

మరమ్మతులు చేయించండి..

సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఎక్స్‌రే మిషన్ రిపేర్ చేయించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సీపీఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు బుధవారం డిమాండ్ చేశారు. ఆస్పత్రికి వచ్చిన రోగులు ప్రైవేట్ సెంటర్‌ను ఆశ్రయించాల్సి వస్తోందని, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

అనాథాశ్రమంలో తనిఖీ

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం బూడిదగడ్డలోని శ్రీ స్నేహలత – సంధ్యాలత పిల్లల ఆశ్రమం, సత్యసాయి అనాథాశ్రమం, సఖి సెంటర్‌ను బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.రాజేందర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అనాథ పిల్లలకు, వృద్ధులకు అందిస్తున్న సౌకర్యాలపై ఆశ్రమ నిర్వాహకులను, కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అనాథ శరణాలయ ఆవరణ, కిచెన్, స్టోర్ రూమ్, రిజిస్టర్లను పరిశీలించారు.

వెల్ఫేర్ జీఎంకు సన్మానం



కిరణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): ఇటీవల కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయంలో జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ సీఎస్సార్) బాధ్యతలు చేపట్టిన జీవీ కిరణ్‌కుమార్‌ను బుధవారం ఆయన చాంబర్‌లో బీసీ, ఓబీసీ అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సంస్థలో వెల్ఫేర్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టి, అంకిత భావంతో పనిచేసి, నిత్యం కార్మికులకు సేవలందించి జీఎంగా ఎదిగారన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.నాగేశ్వరరావు, ఎస్.రమేష్, పి.హరిశంకర్, పి.వీరభద్రరావు, వి.శ్రీనాథ్, గోలి వెంకటేశ్వర్లు, సతీష్ పాల్గొన్నారు.

మైనార్టీ కార్పొరేషన్ లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

ఇల్లెందు: రాజీవ్ యువ వికాసం రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న యువతీ యువకులకు గురువారం 8వ తేదీన పట్టణంలోని సీఆర్సీ భవనంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న యువతీ యువకులు ఉదయం 11 గంటలకు హాజరు కావాలని కోరారు.

దొడ్డు వడ్ల కాంటా షురూ..

సాక్షి ఎఫెక్ట్..

ఇల్లెందురూరల్: రేపల్లెవాడలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో దొడ్డు వడ్ల కాంటా ప్రారంభమైంది. 11 రోజులుగా ధాన్యం కొనే వారు లేక కల్లంలోనే నిల్వ ఉన్న ధాన్యం వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులపై 'పేరుకుపోతున్న ధాన్యం నిల్వలు' శీర్షికతో బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి పీఏసీఎస్ అధికారులు స్పందించారు. ఈ మేరకు బుధవారం దొడ్డు వడ్ల కాంటా ప్రారంభించారు. 780 బస్తాలను కాంటా వేసి మిల్లులకు తరలించారు. ఇదిలా ఉండగా గతంలో కొనుగోలు చేసిన మిల్లర్లు 3 కిలోల చొప్పున కోత విధించిన విషయమై పీఏసీఎస్ సీఈఓ హీరాలాల్‌ను ప్రశ్నించగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

ఘనంగా శ్రీ వాసవీమాత జయంతి



పూజలో పాల్గొన్న ఆర్యవైశ్యులు

పాల్వంచ: ఆర్యవైశ్యుల కులదైవం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని బుధవారం పాల్వంచలో ఘనంగా నిర్వహించారు. బొల్లేరుగూడెంలోని శ్రీలలిత కామేశ్వరి ఆలయంలో అమ్మవారి మూల విరాట్‌కు సాయి చైతన్య వేద పండితులచే కుంకుమ పూజలు, వడి బియ్యం నింపుట, 108 వత్తుల హారతి, అష్టోత్తరం వంటి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదం అందించారు. చలవాది ప్రకాష్, పెండ్యాల రోజాలక్ష్మి, తాటికొండ సురేష్, చలవాది రాజ్యలక్ష్మి, సంక సర్వేష్, దారా శంకర్, నాగమళ్ల కోటి, శ్రీనివాస్, నరసింహారావు, రమ, మాధవి, దీప్తి, స్వప్న, మౌనిక, మణి పాల్గొన్నారు.

సాగుకు రైతులు సన్నద్ధం

వేసవి దుక్కుల్లో నిమగ్నమైన రైతులు



వెంగన్నపాలెంలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

జూలూరుపాడు: ఖరీఫ్ పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా వేసవి దుక్కులు దున్నుకోవడంలో నిమగ్నమయ్యారు. గత ఏడాది ఖరీఫ్, యాసంగి సీజన్‌లలో పండించిన పత్తి, మిరప, మొక్కజొన్న, తదితర పంట పొలాల్లోని ఎండిపోయిన కట్టెను తొలగించి, వాటిని కాల్చివేసి చేలను శుభ్రం చేస్తున్నారు. అదే విధంగా ట్రాక్టర్లతో పొడి దుక్కులు దున్నడంతోపాటు, పశువుల ఎరువును పొలాల్లో పోస్తున్నారు. వేసవి దుక్కులు చేయడం వల్ల ఎంతో మేలు కలుగుతుంది. ముఖ్యంగా వానాకాలం పంటలో తెగుళ్లు, కలుపు మొక్కల నివారణకు ఉపయోగకరంగా ఉంటుంది. వర్షాలకు ముందే భూమిని దున్నడం వల్ల తొలకరిలో వర్షాలు పడగానే నీరు భూమిలోకి ఇంకి భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. దుక్కులు దున్నే ముందు పశువుల, కంపోస్టు ఎరువు, చెరువు మట్టి వెదజల్లడం వల్ల సారవంతమైన నేలగా మారడం, తేమ శాతం పెరగడంతోపాటు పంట అధిక దిగుబడి వస్తుంది. ఇటీవల అకాల వర్షాలు కురవడంతో దుక్కి దున్నడానికి అనుకూలంగా ఉండటంతో రైతులు వేసవి దుక్కులు దున్నే పనిలో నిమగ్నమయ్యారు. దుక్కి దున్నకుండా వదిలేయడం వల్ల భూసారం తగ్గిపోవడమే కాకుండా భూమి లోపలి పొరల నుంచి నీరు గ్రహించుకుని ఆవిరై పోయే ప్రమాదం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. జూలూరుపాడు మండలంలో ప్రధానంగా వాణిజ్య పంటలు పత్తి, మిరప పంటలను అత్యధిక విస్తీర్ణంలో రైతులు సాగు చేస్తారు. వ్యవసాయశాఖ అంచనా ప్రకారం 2025–2026లో పత్తి 18,200 ఎకరాలు, కందులు 270 ఎకరాలు, మిర్చి ఐదు వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో సాగు అయ్యే అవకాశం ఉంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పత్తి పంట సాగు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. గత ఏడాది అధిక వర్షాలు, వరుస తుఫాన్లు కారణంగా పత్తి పంట దెబ్బతినడంతో దిగుబడి తగ్గింది కానీ మార్కెట్‌లో మద్దతు ధర లభించడంతో రైతులకు లాభసాటిగా ఉంది. అయితే మిర్చి పంటకు వైరస్ సోకడంతో మిర్చి పంట తీవ్రంగా దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది ప్రకృతి సహకరిస్తుందని, పంటలకు మంచి ధర లభించకపోతుందా అనే కోటి ఆశలతో వానాకాలం పంటల సాగుకు రైతులు సిద్ధపడుతున్నారు.



గుండ్లరేవులో మిరప కట్టెను ట్రాక్టర్‌తో తొలగిస్తున్న దృశ్యం

సాగుకు భూమిని సిద్ధం చేస్తున్నాం..



వానాకాలం సాగుకు దుక్కులు సిద్ధం చేస్తున్నాం. గతేడాది అధిక వర్షాల వల్ల పత్తి దిగుబడి తగ్గడంతో పెట్టుబడికే సరిపోయింది. పత్తి కంటే మిర్చి పంట లాభదాయకంగా ఉంది. ఈ ఏడాది 4 ఎకరాల్లో మిర్చి పంట, 2 ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తాం. నష్టమైనా, లాభమైనా భూదేవినే నమ్ముకుంటాం. – చౌడం శ్రీను, రైతు, పాపకొల్లు

విత్తనాలు కొనాలి...



పత్తి, మిరప కట్టె తొలగించి ట్రాక్టర్‌తో దుక్కి దున్నేందుకు పొలాన్ని సిద్ధం చేశాం. వర్షాలకు ముందే భూమిని దున్నడం వల్ల తొలకరిలో వర్షాలు పడగానే భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. ఈ ఏడాది ఒక ఎకరం పత్తి, రెండు ఎకరాల్లో మిర్చి సాగు చేస్తాం. విత్తనాలు కొనాలి.

– భూక్యా రత్నకుమార్, రైతు, గంగారంతండా

లోతు దుక్కులు దున్నాలి..



వేసవి దుక్కులు దున్నడం ఎంతో శ్రేయస్కరం. లోతు దుక్కులు దున్నుకోవాలి. ఎండ తీవ్రత వల్ల కోశస్థ దశ పురుగులు, గుడ్లు చనిపోతాయి. తొలకరి వర్షాలకు పంటల సాగుకు అనుకూలంగా ఉంటుంది. అదేవిధంగా దుక్కులు సిద్ధం చేసుకోవడం వల్ల వర్షాలు పడగానే విత్తనాలు విత్తుకోవచ్చు.

– దీపక్ ఆనంద్, ఏఓ, జూలూరుపాడు

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన



మధుర బస్తీలో ఖాళీ బిందెలతో ప్రదర్శన చేస్తున్న మహిళలు, నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీలోని మధుర బస్తీలో వారం రోజులుగా తాగునీరు రాక స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సీపీఎం నాయకులు ఖాళీ బిందెలతో స్థానిక ప్రజలతో రోడ్డుపై బైఠాయించారు. లిక్కి బాలరాజు మాట్లాడుతూ... కొత్తగూడెం మున్సిపాలిటీలో ప్రధాన మంచినీటి వనరు అయిన కిన్నెరసాని నీళ్లు కనీసం వారానికి ఒకసారి కూడా రావడం లేదని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజాప్రతినిదులు, అధికారులు ప్రజల ఇబ్బందులు పట్టించుకోవటం లేదని ఆరోపించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు సమస్యను వివరించగా.. త్వరలో ఈ సమస్యను పరిష్కరిస్తామన్నారని తెలిపారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఆయా బదిలీపై విచారణ



విచారణ చేస్తున్న డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనినా

జూలూరుపాడు: జూలూరుపాడు అంగన్‌వాడీ కేంద్రం – 4కు వెంగన్నపాలెం అంగన్‌వాడీ కేంద్రం–2లో పని చేసే ఆయా వరలక్ష్మిని అక్రమంగా బదిలీ చేశారని, వెంగన్నపాలెంలో నివాసం ఉంటున్నట్లు సర్టిఫికెట్లు పొంది, అక్కడ ఉద్యోగం వచ్చిందని ఆరోపిస్తూ జూలూరుపాడు కోయకాలనీ వాసులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా జూలూరుపాడు అంగన్‌వాడీ కేంద్రం–4ను సందర్శించారు. విచారణ అధికారి, పాల్వంచ ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీప్రసన్నతో కలిసి డీడబ్ల్యూఓ లెనినా అయాపై వచ్చిన ఆరోపణపై విచారణ నిర్వహించారు. డీడబ్ల్యూఓ లెనినా మాట్లాడుతూ.. జీఓ ప్రకారమే ఆయా బదిలీ జరిగిందన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్మాణ దశలో ఉన్న ఇంకుడుగుంతను పరిశీలించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ చంద్రుగొండ సీడీపీఓ సలోమి, సూపర్‌వైజర్ నాగమణి ఉన్నారు.

ఇన్‌చార్జ్ వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓగా కృష్ణమాచారి

పాల్వంచరూరల్: వన్యమృగాల సంరక్షణ విభాగం పాల్వంచ డివిజనల్ అధికారి (ఎఫ్‌డీఓ) బి.బాబు మూడునెలలపాటు లాంగ్ లీవ్ తీసుకుని అమెరికా వెళ్తున్నారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జ్ ఎఫ్‌డీఓగా వరంగల్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌డీఓ పి.కృష్ణమాచారికి పీసీసీఎస్ అప్పగించారు. గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

ప్లాస్టిక్ కవర్లు సీజ్

ఇల్లెందు: పట్టణంలోని పలు షాపుల్లో మున్సిపల్ సిబ్బంది దాడులు చేసి ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేశారు. బుధవారం ఇల్లెందు మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లాల్యా ఆధ్వర్యంలో సిబ్బంది టీంల వారీగా పలు షాపుల్లో నిషేధిత ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను పట్టుకున్నారు. మరోమారు షాపుల్లో కనిపిస్తే షాపులు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

అల్లూరి పోరాట స్ఫూర్తితో ఉద్యమిద్దాం..

ఇల్లెందురూరల్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దామని మాస్‌లైన్ నాయకులు నాయిని రాజు, అజయ్, ఆజ్మీర బిచ్చా పిలుపునిచ్చారు. పోలారం గ్రామంలో బుధవారం అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మాట్లాడుతూ.. ఆదివాసీలను ఏకం చేసి తెల్లదొరలపై అల్లూరి సీతారామరాజు చేపట్టిన తిరుగుబాటు ఉద్యమం స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో శ్రీరాంకోటయ్య, జూకంటి గాంధీ, రాంబాబు, నారాయణ, చంద్రశేఖర్, కిరణ్, వీరభద్రం, శాంతారావు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు




పాల్వంచరూరల్: హోమం నిర్వహిస్తున్న పూజారి

పాల్వంచరూరల్: శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 332వ ఆరాధన మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. లక్ష్మీదేవిపల్లిలో ప్రధాన పూజారి పెద్దోజు నాగాచారి, ఆరిందల యశ్వంత్ శర్మల ఆధ్వర్యంలో మూలతంత్ర హోమం, సజీవ సమాధి ఘట్టం, పల్లకీ సేవ నిర్వహించారు. ఈ పూజలో తహసీల్దార్ వివేక్, కొత్వాల శ్రీనివాసరావు, నాంపల్లి వేణుగోపాలచారి, ఎస్ఐ సురేశ్, ఆర్ఐ రవికుమార్‌రెడ్డి, కాపర్తి వెంకటాచారి, డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ స్వాతి పాల్గొన్నారు.

జూలూరుపాడు: శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 332 ఆరాధన మహోత్సవ కార్యక్రమాన్ని బుధవారం విశ్వబ్రాహ్మణులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పాపకొల్లు, కాకర్ల, వెంగన్నపాలెం శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో పూజారులు సున్నం ఓంకారా చారి, శివ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించి, స్వామి వారి జెండాలను ఆవిష్కరించారు. హైదరాబాద్ విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ సున్నం శ్రీనివాసాచారి, సున్నం పెద్ద వీరాచారి, సున్నం అనంతాచారి, సున్నం ప్రసాద్, చంద్రగిరి రమేష్, పూసాల శ్రీనివాసాచారి, సున్నం మధు, వీరభద్రాచారి, కరుణాకర్, సున్నం వెంకటేశ్వర్లు, సున్నం పిచ్చాచారి, సున్నం పవన్, పూసాల లింగాచారి, దాసోజు బ్రహ్మం, యలబాక శ్రీనివాసరావు, కాసర్ల మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనా మహోత్సవ కార్యక్రమాలు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి అభిషేకం చేశారు.

చినుకు పడితే చిత్తడే..



మురుట్లలో పక్కా రోడ్డుకు నోచుకోని వీధి

టేకులపల్లి: రామచంద్రునిపేట గ్రామ పంచాయతీ మురుట్ల గ్రామం ఏర్పడి సుమారు ఐదు దశాబ్దాలు దాటింది. గ్రామంలోని ఓ వీధిలో ముడిగ రాధాకృష్ణ ఇంటి నుంచి ముడిగ సూర్యం ఇంటి వరకు కచ్చా రోడ్డు ఉంది. చినుకు పడితే చాలు లోతట్టు ప్రాంతమైన ఈ వీధి వాగులాగా మారుతోంది. పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా దశాబ్దాలుగా ఈ వీధికి పక్కా రోడ్డు వేసింది లేదు. పంట పొలాలకు వెళ్లాలంటే రైతులకూ ఇదే దారి. వర్షం పడితే రాకపోకలకు నానా తంటాలు. మండలంలోని అధిక శాతం గ్రామాలు, వీధులకు సీసీ రోడ్లు మంజూరయ్యాయి. కానీ ఈ వీధికి మాత్రం సీసీ రోడ్డు మంజూరు కాకపోవడం శోచనీయం. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సీసీ రోడ్డు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నీటి ఎద్దడి నివారణకు రూ.8.92 కోట్లు మంజూరు

సూపర్‌బజార్(కొత్తగూడెం): గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో తాగునీటి సమస్య నివారణకు రూ.8.92 డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరైనట్లు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బుధవారం తెలిపారు. నియోజకవర్గంలో ఈ నిధులతో ట్యాంకులు, పంపుహౌస్‌లు, సంపులు, నూతన పైపులైన్లు, పైపులైన్ల మరమ్మతులు, బోర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కోయగూడెం, సోలెంగుంపు, శేషయ్య గుంపు, ఉప్పరిగూడెం, నర్సింహాసాగర్, నారంగ్‌తండ, నిమ్మలగూడెం, సింగభూపాలెం, పెనుబల్లి, సాటివారిగూడెం, కారేగట్టు, సారెకల్లు గ్రామాలలో నెలకొన్న నీటిసమస్య పరిష్కారానికి రూ.2.92కోట్లు మంజూరు కాగా, చుంచుపల్లి మండలానికి రూ 1.70 కోట్లు, సుజాతనగర్ మండలానికి రూ 1.40 కోట్లు, లక్ష్మీదేవిపల్లి మండలానికి రూ.1.53 కోట్లు, పాల్వంచ మండలానికి రూ.1.37 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో 71 పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. శాశ్వతంగా మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

సింగరేణిని కాపాడుకుందాం..



మాట్లాడుతున్న అబ్దుల్ నబీ

టేకులపల్లి: ఈనెల 20న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఇల్లెందు బ్రాంచి కమిటీ ఆధ్వర్యంలో కోయగూడెం ఓసీలో సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిట్ మీటింగ్ బ్రాంచి కార్యదర్శి ఎండీ అబ్బాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నబీ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత చట్టబద్ధత కలిగిన 29 కార్మిక చట్టాలను రద్దు చేశారని వాటి స్థానంలో తెచ్చిన చట్టబద్ధత లేని నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బొగ్గు పరిశ్రమను ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ చేయకూడదని, కమర్షియల్ మైనింగ్ రద్దు చేసి ప్రభుత్వ ఆధ్వర్యంలో నడపాలని పేర్కొన్నారు. అంతేకాకుండా సింగరేణికి కొత్త బ్లాకులు కేటాయించి బొగ్గును సింగరేణి సంస్థ ద్వారా తీయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించి చట్టబద్ధ హక్కులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, వరంగంటి రాజమొగిలి, జనార్ధన్ రాజు, ఎండీ అబ్బాస్, సిరాజ్ అహ్మద్, కడుదల వీరన్న, నరసింహారావు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి..



వర్క్‌షాపు డీజీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని వీకే వర్క్‌షాపు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ మధు ఆధ్వర్యంలో బుధవారం డీజీఎం శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. వేసవితాపం దృష్ట్యా వర్క్‌షాపులో సౌకర్యాలు మెరుగుపర్చాలని, కార్మికులకు ప్రీషిఫ్ట్ ఇవ్వాలని, కూలర్లు, మజ్జిగ ప్యాకెట్లు, చల్లని మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా వర్క్‌షాపులో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులతోనే టిండాల్, సూపర్‌వైజర్ ఖాళీలను భర్తీ చేయాలని, అదే పద్ధతిలో టిండాల్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. విధి నిర్వహణలో భాగంగా వర్క్‌షాపు నుంచి సత్తుపల్లికి వెళ్లే కార్మికుల కోసం ఏసీ వాహనాన్ని ఏర్పాటు చేయాలని, బైక్ స్టాండ్ సౌకర్యం కల్పించాలని, గుండె, ఇతర జబ్బులతో పిట్ ఫర్ సర్ఫేస్‌గా మారిన, వయోభారం కలిగిన కార్మికులపై పనిభారం తగ్గించాలని, బరువుగల వస్తువులను ఎత్తటానికి ఫోర్క్ లిఫ్టర్‌ను సమకూర్చాలని కోరారు. అదేవిధంగా ప్రతినెల సేఫ్టీ కమిటీలు నిర్వహించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన డీజీఎం సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా బ్రాంచి నాయకులు మల్లికార్జున్‌రావు, వైస్ ప్రెసిడెంట్ కత్తెర రాములు, ఆది రాజేందర్, కరుణాకర్, గౌరీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర జెండానే పేదవర్గాలకు అండ



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

చుంచుపల్లి: గ్రామీణ ప్రజలు రాజకీయాలకు అతీతంగా సమష్టిగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. చుంచుపల్లి మండలం పెనుబల్లి గ్రామాన్ని సీపీఐ ప్రతినిధి బృందం బుధవారం సందర్శించి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులతో మాట్లాడారు. ఎర్ర జెండానే పేదవర్గాలకు, గ్రామీణ ప్రజలకు అండగా ఉంటుందని, సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. పెనుబల్లిలో రహదారి సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే కూనంనేని బ్రిడ్జి పునఃనిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరు చేశారని, అదేవిధంగా గ్రామంలో రూ.32 లక్షలతో అంతర్గత రహదారులు, డ్రెయిన్లు నిర్మించడం జరిగిందన్నారు. 150 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, కిలారు ప్రసాద్, భవాని, ఇనుముల నర్సింహారావు, బి.భాస్కర్, బి.కిరణ్, శరభచారి పాల్గొన్నారు.

కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేయండి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): రెండు దశాబ్దాలకు పైగా పెనగడప ప్రాంతంలో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న ఆదివాసీలకు ఎస్టీ కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా ప్రభుత్వాధికారులను కోరారు. చుంచుపల్లి మండలం పెనగడప పంచాయతీ పాలవాగు, జగ్గారం, మర్రిగూడెం, గడ్డిగుట్ట, ఆదివాసీ గ్రామాల ప్రజల సమావేశం స్థానిక శేషగిరిభవన్‌లో బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సాబీర్‌పాషా మాట్లాడుతూ... దశాబ్దాల కాలంగా స్థిర నివాసం ఏర్పరచుకున్న ఆదివాసీలకు కుల ధృవీకరణ పత్రాలు లేకపోవడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. నీడాల సుధాకర్, కట్టా ఉదయ్, మన్నే వీరభద్రరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

అడుగడుగునా గుంతలు.. వాహనదారుల తంటాలు

- ప్రమాదకరంగా కేఓసీ రోడ్డు
- పట్టించుకోని అధికారులు





రేగులతండా నుంచి పెట్రాంచెలక స్టేజీ వరకు గుంతలమయమైన రహదారి

టేకులపల్లి: టేకులపల్లి – బోడు రహదారి వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. టేకులపల్లి (రేగులతండా చివర) నుంచి పెట్రాంచెలక స్టేజీ వరకు రోడ్డు అడుగడుగునా గుంతలతో ప్రమాదకరంగా మారింది. అయినా మరమ్మతులకు నోచుకోవడం లేదు. గుంతలతో చస్తున్నాం.. వాహనాలు దెబ్బతింటున్నాయి..

ప్రమాదాలు జరుగుతున్నాయి.. రోడ్డుకు మరమ్మతులు చేయించండి అని బాధిత ప్రజలు మొర పెట్టుకుంటున్నా.. చేస్తాం, చూస్తున్నాం అంటూ అధికారులు చెబుతుండటమే కానీ క్షేత్రస్థాయిలో పట్టించుకున్న దాఖలాలు లేవు. టేకులపల్లి నుంచి బోడు 15 కిలోమీటర్లు. ఈ రెండు గ్రామాల మధ్య గతంలో ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో బీటీ రోడ్డు వేశారు. కోయగూడెం ఓపెన్‌కాస్టు నుంచి వందలాది బొగ్గు టిప్పర్లు, లారీలు ఈ రోడ్డు మీదుగానే వెళ్తుంటాయి.

రహదారి నిర్వహణ, మరమ్మతుల బాధ్యతను ఆర్‌అండ్‌బీ శాఖ సింగరేణికి అప్పగించింది. దీంతో టేకులపల్లి – పెట్రాంచెలక స్టేజీ వరకు 8 కిలోమీటర్ల రోడ్డును 2001 నుంచి సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహణ కొనసాగుతోంది. లారీలు, టిప్పర్లతో పాటు ఇతర వాహనాల రాకపోకల వల్ల ఈ రోడ్డు ధ్వంసమైంది. రేగులతండా, రైస్‌మిల్ ఏరియా, మంగలితండా క్రాస్‌రోడ్, చుక్కాలబోడు క్రాస్‌రోడ్, అందుగులబోడు, తుమ్మలచెలక స్టేజీ, ఆంజనేయ పాలెం, సామ్యాతండా, పెట్రాంచెలకస్టేజీ తదితర గ్రామాల సమీపంలో రోడ్డు అడుగడుగునా గుంతలతో ప్రయాణం నరకంగా ఉంది. ఆ రూట్‌లో జీవనోపాధి కోసం ఆటోలు నడుపుకునే వారు వాహనాలు దెబ్బతిని ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇతర వాహనాలతో పాటు కేఓసీ నుంచి బొగ్గు రవాణా చేసే టిప్పర్లు, లారీలకు కూడా నష్టం వాటిల్లుతోంది. వారం రోజుల క్రితమే పెట్రాంచెలక స్టేజీ సమీపంలో ప్యాచ్ పనులు చేపట్టారు. మిగిలిన ప్రాంతంలో మరమ్మతులు చేయాల్సి ఉంది. ఇప్పటికైనా సింగరేణి అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

ఆటోలు దెబ్బతింటున్నాయి..



ప్రతీరోజు బోడు నుంచి టేకులపల్లికి ఆటో సర్వీసు నడిపిస్తుంటాను. రోడ్డు గుంతలతో ప్రమాదకరంగా ఉండడంతో ఇబ్బంది పడుతున్నాం. వచ్చే ఆదాయం ఆటో మరమ్మతులకు సరిపోవడం లేదు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయించాలి.

– గురుమూర్తి, ఆటో డ్రైవర్, బోడు

అధికారులు స్పందించాలి..



కోయగూడెం ఓపెన్‌కాస్టు ద్వారా సింగరేణికి రూ.కోట్ల ఆదాయం వస్తుంది. కేఓసీ నుంచి పెట్రాంచెలక స్టేజీ మీదుగా టేకులపల్లి వైపు నుంచి ఇతర ప్రాంతాలకు నిత్యం బొగ్గు రవాణా జరుగుతుంది.సింగరేణి అధికారులు స్పందించి ధ్వంసమైన రోడ్డుకు మరమ్మతులు చేయించాలి.

– ఇస్లావత్ రెడ్యానాయక్, కోయగూడెం